www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 30 | జూలై | 2026
పేజీలు : 8

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



- మౌలిక వసతుల కల్పనే ధ్యేయం
- ఎంఎల్ఏ కూనంనేని
- సిసి రోడ్డు, కార్మిక సంక్షేమ భవన్ పనులకు శంకుస్థాపన

2 లో

# ఈ చర్యలు దేనికి సంకేతం..?

-ఈ బదిలీల నిలుపుదల వెనక మర్మమేంటి..?
-ఎవరికి తలొగ్గారు.. అధికారానికా.. యూనియన్లకా..?
-చర్చనీయాంశమైన బోనకల్ బదిలీలు.. రద్దు






ప్రజాపక్షం/ ఖమ్మం :

ఒక చర్యతో జిల్లా అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. గాడి తప్పితే తమకు శిక్ష తప్పదన్న భావన మదిలో స్మరించింది. మరుసటి రోజు ఆ భావన స్థానే మనం ఏం చేసినా చూసుకోవడానికి కొందరు ఉన్నారు. మన అక్రమ వ్యవహారం చెల్లుబాటేనన్న దీమా వచ్చింది. ఈ రెండు అభిప్రాయాల మధ్య కేవలం కొన్ని గంటల వ్యవధి మాత్రమే ఉంది. ఒక చర్యతో ప్రజలు ప్రభుత్వ అవినీతి పరుల భరతం పడుతుందనుకున్నారు ఆ చర్య ఉపసంహరణ తర్వాత ఎవరున్నా అవినీతిని ప్రోత్సహించే వారేనా అన్న ఆవేదన కలిగింది. బోనకల్ మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న ముగ్గురు అధికారులు మరో ఉద్యోగిని జిల్లా అధికార యంత్రాంగం ఆకస్మికంగా బదిలీ చేసింది. కల్లూరు, కూసుమంచి, ఏన్కూరు తదితర ప్రాంతాలకు ముగ్గురు అధికారులను బదిలీ చేసిన ఒక రోజు తర్వాత తిరిగి ఆ అధికారులు యధాస్థానంలోకి వచ్చి ఇప్పుడు తమ విధులను నిర్వహిస్తున్నారు. బోనకల్ మండలంలో రెవెన్యూ అధికార యంత్రాంగం ప్రతి పనికి ఒక రేటు కట్టి వసూళ్లు చేస్తున్నారని బాధితుల వేదనతో కూడిన పలు ఫిర్యాదులు అధికారుల దృష్టికి రావడమే గాక మీడియాలోనూ ప్రచురితమయ్యాయి. ముఖ్యంగా వారసత్వ భూములు, ధృవీకరణ పత్రాల విషయంలో ఇక్కడి అధికారులు లంచాన్ని హక్కుగా మార్చుకుని డిమాండ్ చేస్తున్నారని మిగతా 2లో..

## పోరాటాలు, నిరసనలు ప్రజల హక్కు






-నిర్బంధాలతో అణిచివేస్తే పతనం తప్పదు
-శృతిమించుతున్న మతోన్మాదుల వ్యాఖ్యలు
-సిపిఐ శిక్షణా తరగతుల్లో బాగం

ప్రజాపక్షం/ఖమ్మం : ప్రజాస్వామ్య దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలపడం, సానుకూల పోరాటాలు నిర్వహించడం ప్రజల హక్కు అని దానికి భంగం కలిగించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై హింసాత్మక చర్యలకు పాల్పడటం, అక్రమంగా కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. బుధవారం ఖమ్మం నియోజక వర్గ స్థాయి సిపిఐ సభ్యుల శిక్షణా తరగతులు స్థానిక జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. శిక్షణా తరగతులకు ముందు సిపిఐ పతాకాన్ని ఖమ్మం నియోజక వర్గ కార్యదర్శి ఎస్‌కె జానిమియా ఆవిష్కరించారు. పగడాల మల్లేష్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో ప్రస్తుత రాజకీయాలు కమ్యూనిస్టుల పాత్ర అనే అంశాన్ని హేమంతరావు బోధిస్తూ లక్షలాది మంది విద్యార్థుల మిగతా 2లో..

## అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం రూ.12.06 కోట్ల వ్యవయంతో చేపట్టనున్న రోడ్లు, ఆశ్రమ పాఠశాల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేసి భూమి పూజ నిర్వహించారు. తొలుత స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రూ.7.21 కోట్లతో చేపట్టనున్న రెండు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. డాక్యాతండాలో రూ.1.41 కోట్లతో మిగతా 2లో..

# ఏడున పెన్షనర్ల చలో హైదరాబాద్




-వాగ్దానాలే తప్ప అమలు కానీ హామీలు
-పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లయ్య
-పెన్షనర్ల పితామహుడు డిఎస్ నకారాకు నివాళి



ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలకు సంబంధించి హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆగస్టు ఏడున తలపెట్టిన ఆందోళనకు సంబంధించి డిమాండ్స్‌తో కూడిన గోడప్రతులను బుధవారం స్థానిక కృషి భవన్ వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పుల్లయ్య మాట్లాడుతూ నెలకు పెన్షనర్ల బకాయిల చెల్లింపులకు గాను రెండువేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి నెలలు గడిచినా ఆ హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. అరకొరగా చెల్లింపులు జరిపిన ప్రభుత్వం ఈ నెలకు సంబంధించి కనీస ప్రకటన చేయ లేదని పెన్షనర్లలో ఆందోళన నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు విడతల డిఏ బకాయిలు చెల్లించలేదని వేతనాల్లో కోత విధిస్తున్నా, హెల్త్ కార్డులకు సంబంధించి స్పష్టత లేదని ఆయన స్పష్టం చేశారు. స్పౌజ్ కేసుల విషయంలోనూ ఆసుపత్రుల కేటాయింపు విషయంలోనూ హెల్త్ కార్డు జారీ విషయంలోనూ పెన్షనర్ల అనుమానాలను నివృత్తి చేయ డంలో విఫలమైందన్నారు. 2024 నుంచి ఉద్యోగ విరమణ చేసిన వారి బకాయిలను ఇప్పటికైనా విడుదల చేసి వారికి మానసిక ప్రశాంతతను ఇవ్వాలని, ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్న ఈ ప్రభుత్వంలో స్పందన ఆశించిన స్థాయిలో లేదని తెలిపారు.

**నకారాకు నివాళి...**

పెన్షనర్ల పితామహుడు డిఎస్ నకారా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వతంత్ర భారతంలో పెన్షనర్ల హక్కుల కోసం తొలిసారి పోరాడి ఎందరికో పెన్షన్‌ను హక్కుగా చేర్చారని ఈ సందర్భంగా పుల్లయ్య తెలిపారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరాడటమే నకారాకు నిజమైన నివాళి ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, సంఘ బాధ్యులు కనపర్తి వెంకటేశ్వర్లు, పెదమాళ్ల సత్యనారాయణ, కొల్లికొండ శరత్, బాబు, వెంకటేశ్వర్లు, జిల్లా వెంకటేశ్వర్లు, బోజ్జ కృష్ణకుమారి, తాడి అంజలి, చీదిరాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ మాజీ వార్డు మెంబర్ కుమారుడు మృతి

**నివాళులర్పించిన సిపిఐ నేతలు**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 28వ వార్డుకు చెందిన సిపిఐ మాజీ గ్రామపంచాయతీ వార్డు మెంబర్, మండల సమితి సభ్యుడు షేక్ రజబెల్లి కుమారుడు మైబల్‌సాబ్(38) అనారోగ్యంతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఖమ్మంరూరల్ మండల సమితి సభ్యులు మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు, 28,29,30 డివిజన్ల సిపిఐ కార్యదర్శులు లగిశెట్టి రమేష్, వెంపటి రాము, బియ్యాల రాజు, స్థానిక సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# నల్లమోతు నరసింహారావు మృతికి సిపిఐ నివాళి



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిధిలోని రామనర్స్యయ్యనగర్‌లో సిపిఐ నాయకులు నల్లమోతు నరసింహారావు అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం సిపిఐ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా నాయకులు స్వర్ణ రమేష్ నరసింహారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా దొండపాటి రమేష్ మాట్లాడుతు పేదప్రజల సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషిని కొనసాగించాడని తెలిపారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. వీరితోపాటు సిపిఐ నాయకులు అంగోత్ మంగీలాల్, గుగులోత్ శ్రీను, శోభన్, ముత్తయ్య, సత్రు, లక్క తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తాం

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి**



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలం లోని గ్రామాలకు చెందిన 42 మంది లబ్దిదారులకు గురువారం పెనుబల్లి రైతువేదికలో ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి 42 మంది లబ్దిదారులకు రూ.12,81,500/ రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇళ్లు లేని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వీరభద్రనాయక్, రెవిన్యూ అధికారులు,పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వర రావు, ఏఎంసి వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పదుమర్తి విశ్వనాథ్, పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కస్నాతండాలో మళ్లీ దొంగల భీభత్సం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని కస్నాతండాలో వైర్ల దొంగలు మరోసారి భీభత్సం సృష్టించారు. జులై 23న జరిగిన భారీ వైర్ల దొంగతన్నం ఘటన నుంచి రైతులు ఇంకా కోలుకోక ముందే అదే తరహాలో మంగళవారం అర్ధరాత్రి మరోసారి చోరీ జరగడం ఆందోళనకు గురి చేస్తోంది.గత ఘటనలో ఆరుగురు రైతుల విద్యుత్ మీటర్లకు బిగించిన సుమారు రూ.72వేల విలువైన విద్యుత్ వైర్లను దొంగలు అపహరించగా బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు గుర్తుతెలిని వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదైన పటికీ దొంగలు ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా మళ్లీ అదే ప్రాంతంలో గమనార్హం. తాజాగా వైర్లు కోల్పోయిన నలుగురు రైతులు గ తంలో వైర్లు పోగా ఏర్పాటు చేసుకున్న రైతులవే కావడం విశేషం. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి , వైర్ల దొంగలను త్వరితగతిన గుర్తించి అరెస్టు చేయడంతో పాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

**భక్తులతో పోటెత్తిన సాయిబాబా ఆలయాలు**





ప్రజాపక్షం/వైరా: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వైరా మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఐదో వార్డులోని సాయిబాబా మందిరం, పదో వార్డు గండగలపాడులోని షిరిడి సాయి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి బాబా ఆశీస్సులు పొందారు. బాబా దర్శనం అనంతరం ఆలయాల వద్ద ఏర్పాటు చేసి మహా అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. గండగలపాడు సాయి బాబా ఆలయంలో మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, డాక్టర్ కాపా మురళీకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మల్లన్నపాలెంలో ఎస్ఐఆర్ 95శాతం పూర్తి



ప్రజాపక్షం/ముదిగొండ: మండలంలోని మల్లన్నపాలెం గ్రామంలోని భూత్ నం.33లో సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 95 శాతం పూర్తి చేసినట్లు బీఎల్‌వో ఎలగాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. రెండు రోజుల్లో మిగిలిన 5శాతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయ కుడు, మాజీ సర్పంచి చిలకల రామకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ నాగుహుస్సేన్ ఖాన్, ఉపాధ్యక్షుడు ఏనబోయిన ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాపక్షం/పెనుబల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని మండాలపాడు గ్రామానికి చెందిన మల్లె సాంబశివరావు (32 ) కుటుంబ కలహాలతో గురువారం ఇంట్లో ఎవరు లేని సమయం లో ఉరి వేసుకుని ఆత్మహత్య కు పద్పాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వియం బంజర పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు



ప్రజాపక్షం/బోనకల్: భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో మధిర, బోనకల్, చింతకాని మండలాలల పార్టీ సభ్యుల కోసం నేడు బోనకల్‌లోని ఖమ్మం రోడ్డులో ఉన్న ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తెలిపారు. మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్ విలేకరుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ మూడు మండలాల నుంచి ఎంపిక చేసిన సుమారు 500 మంది పార్టీ సభ్యులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, వాటి పరిష్కారమార్గాలు, కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలు, ప్రజా ఉద్యమాల దిశ, పార్టీ వైఖరి తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ శిక్షణా తరగతులకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరై వివిధ అంశాలపై బోధించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమయానికి హాజరై శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని యంగల ఆనందరావు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర భాస్కరరావు, గుంపుల జయరాజు, కాకాటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాలీ ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**-బస్సులోని పదిమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు**



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో కోల్డ్ స్టోరేజ్ వద్ద బుధవారం ఖమ్మం నుంచి వైరా వైపు వస్తున్న ట్రాలీ ఆటోను సత్తుపల్లినుంచి ఖమ్మంవైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ట్రాలీ ఆటోను ఢీకొట్టి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈసంఘటనలో పదిమంది ప్రయాణీకులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్ద ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరం : కూనంనేని



**ప్రజాపక్షం/సుజాతనగర్:** ప్రభుత్వ ఉపాధ్యా యుడు పీఈటి చింతలపూడి యుగం ధర్ గుండెపోటుతో మరణిం చడం చాలా బాధా కరమైన విషయమని కొత్తగూడెం శాసనస భ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సాయంత్రం విధులు ముగిం చుకొని బైక్ పై జూలూరుపాడు నుండి సుజా తనగర్ వస్తుండగా మార్గ మధ్యలో గుండె పోటుతో అకాల మరణం చెందగా విషయం తెలుసుకొని సుజాతనగర్ లోని స్వగృహానికి వచ్చి యుగంధర్ పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ యుగంధర్ తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా, కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, తల్లూరి పాపారావు, భాగం శేష భూషణం, దండు సురేష్, దండు నాగేశ్వరరావు, కోమరి కృష్ణ, గద్దం రాజేందర్, కిలారు రామచందరావు, సత్యనారాయణ, నరేష్, శశికాంత్, సుజాతనగర్ మండల సిపిఐ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయ కుడు సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవా రం మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొక్కల పెంపకం వల్ల పచ్చదనం పెరగడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విశ్వనాథపల్లి సర్పంచ్ ఇస్లావత్ రాజు, పంచాయితీ కార్యదర్శి నాగలక్ష్మీ, గ్రామస్తులు దమ్మలపాటి రాంబాబు, మొగిలిచర్ల మల్లికార్జున్‌రావు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంలో రాజీలేదు..



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ మాదారం గ్రామ సర్పంచ్ ఉమా నరేష్ చొరవతో, దాతల సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ 20వేల విలువైన ఫ్రిజ్‌ను అందజేశారు. ఈ ఫ్రిజ్‌ను దాత కిలారీ వెంకటేశ్వరరావు దంపతులు అందించారు. ప్రమాదాలు, కుక్క కాటు, పాము కాటు, తేలు కాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో వ్యాక్సిన్లు నిల్వ ఉంచేందుకు ఇప్పటి వరకు సరైన సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఫ్రిజ్ ఏర్పాటుతో అన్ని రకాల వ్యాక్సిన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని వైద్య సిబ్బంది తెలిపారు. ఈసందర్భంగా సర్పంచ్ ఉమా నరేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో రాజీ పడబోనని, గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారాలే తన లక్ష్యమని చెప్పారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి విజయ్, ఏఎన్ఎంలు పుష్ప, చందన, దాత కిలారీ వెంకటేశ్వరరావు, కాసాని లక్ష్మీ నారాయణ, వార్డు సభ్యులు అజ్మీర శారద, అజ్మీర రజిని, భారతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్య సొసైటీపై న్యాయ పోరాటం చేస్తా..



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని చెరువుమాధారం మత్స్యపారిశ్రామక సహకార సంఘం లో జరుగుతున్న అక్రమాలపై న్యాయ పోరాటం చేస్తానని తెలంగాణ గిరిజన సంఘం నాయకులు పాల్యా కోట్యా పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధ వారం విలేకర్ల సమావేశం ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు... చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహ కార సంఘం నిబంధనలు ఉల్లంఘించి చేపల వేట కొనసాగించిం దన్నారు. సొసైటీ లో కాంట్రాక్టర్ వ్యవస్థ ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. స్థానికులకు చేపలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇతర ప్రాంతాలకు తరలించారని ఆరోపించారు. మత్స్య సొసైటీ పై మత్స్యశాఖ కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదన్నారు. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి పై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ తో పాటు, మత్స్య శాఖ అధి కారుల పై న్యాయం పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ చెరువుమాధారం చెరువు పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## విచారణ.. విజిలెన్స్ దాడులు.. అంతా గోప్యం..?








**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండలం లో వింత చోద్యం జరుగుతుంది. కొన్ని ప్రభుత్వ శాఖల పైన, కొందరు అవినీతి ఉద్యోగుల పైన అనేక ఆరోపణలు రావ టం, ప్రభుత్వ నిధులు కైంకర్యం చేశారని ఫిర్యాదులు రావటం, వాటి పైన త్రిసభ్య కమిటీ, శాఖ పరమైన విచారణ జరగటం, అలాగే కొన్ని ప్రైవేటు వ్యాపారల పైన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు జరగటం జరుగుతుంది. ఇంత వరకు బాగానే ఉంది. తదు పరి చర్యలు మాత్రం అంతా గొప్యం అని ఇంత మాత్రానికి హడావుడి ఎందుకు అని ప్రజలు, అనేక సంఘాలు చెవులు కొరుక్కుంటూ ఛలోక్తులు విసురుతున్నారు. దాడులు జరిగినా, విచారణ జరిగినా ఏమి జరి గింది, అవినీతి జరిగిందా లేదా, కొందరు వ్యాపారులు అక్రమ వ్యాపారం చేస్తున్నారా లేదా అన్నది తేల్చవలసిన భాద్యత విచారణ అధి కారులపై ఉంది. కానీ ఆ విషయం గొప్యం. మండలం లో ఓగురుకుల పాఠశాల లో పియంశ్రీ నిధులు గోల్ మాల్ అయ్యాయని త్రిసభ్య కమిటీ విచారణ జరిపింది. అనంతరం జోనల్ అధికారి శాఖ పరమైన విచారణ అన్నారు. అది బుట్టదాఖలు అయిందనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. నెల క్రితం కల్లూరులో రెండు లారీల అక్రమ బియ్యం పట్టుకు న్నారు. అది రేషన్ బియ్యం అని అవి లంకాసాగర్ రోడ్డు లోని రైస్ మిల్లుకు తరలిస్తున్నారన్న వదంతులు వ్యాపించాయి. ఆ విషయం గప్ చుప్ గా ముగిసింది. బుధవారం రాత్రి లంకాసాగర్ రోడ్డు లోని సన్ రైజ్ అనే రైస్ మిల్ లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ శాఖ అధికారులు దాడి చేశారు. అదీ గప్ చిప్ ఇలా అనేకం మండలం లో జరుగుతున్నా విచా రణలు, విజిలెన్స్ దాడులు ఫలితాలు మాత్రం లోగుట్టు పెరుమాళ్ళకే ఎరుక రీతిలో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు అర్థమవుతున్నాయి. ఇన్ని జరిగినా అసలు విషయం బయటకు పొక్కకుండా అవినీతి ఉద్యోగులు, అక్రమ వ్యాపారుల ఫైరవీల ముందు నిజం బుట్టదాఖలు అవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. హడావిడి దాడులు, విచారణ లో నిజాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని ఆరోపణలు ఉండటమే కాకుండా అక్రమారులు తప్పించుకుని ప్రజల సొమ్ము అక్రమంగా చేతులు మారి ప్రజలకు అందాల్సిన సంక్షేమం, నిధులు పక్క దారి పడుతున్నాయని ఆరోపణలు అనేకం ఉన్నాయి. అవినీతి జరిగిందని నిరూపణ అయితే అట్టి వ్యక్తులను శిక్షిస్తే మరికొందరు అవినీతికి పాల్పడే వ్యక్తులలో గుబులు పుట్టి అవినీతికి అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని మండల పరిధిలో అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎవరు ఎన్ని చెప్పినా ఏమి చేసినా విచారణ అధికారులది దాడి చేసిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులను అడిగితే... ఒక్కటే సమాధానం ఆ ఒక్కటి అడక్కు అనే సమాధానం. విచారణ జరిపాం దాడులు చేశాం.. జిల్లా అధికారులకు నివేదిక అందిస్తాం.

## ఏజెన్సీలో దళితులకు సమాన హక్కులు కల్పించాలి

- ఆగస్టు 3న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి
- డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాజ్యాంగ కల్పించిన సమాన హక్కులు దేశంలో ప్రతీ పౌరునికీ అందుబాటులో ఉండాలని, ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల సమానంగా దళితులకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించాలని ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దళితహక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ అన్నారు. డిహెచ్‌పిఎస్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో సుంకిపాక ధర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సలిగంటి మాట్లాడుతూ దళితుల హక్కుల పరిరక్షణ అభివృద్ధి కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో దశాబ్దాల కాలంగా గిరిజనులతో కలిసి జీవనం సాగిస్తున్న దళితులు ఇప్పటికీ భూమి ఉపాధితో పాటు అనేక అంశాల్లో వెనుకబాటు తనంలోనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన అభివృద్ధిఫలాలు పొందేలా ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్రైవేటు రంగాల్లో కూడా దళితులకు రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయడం ప్రస్తుత కాలానుగుణంగా ఎంతో అవసరమని, ఇందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా మతం పేరుతో ఎస్‌సిలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మతానికి కులానికి ఏ మాత్రం సంబంధం ఉండని, మతం పేరును అడ్డుపెట్టుకుని ఎస్‌సి కులధృవీకరణ పత్రాలు రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడటం హేయమన్నారు.ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు దళితుల సమగ్రాభివృద్ధికి వినియోగించాలని, వాటిని దారిమళ్లించి దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయరాదని కోరారు. ఆర్థిక స్వావలంబన ద్వారానే దళిత సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, దళితుల సమస్యల పరిష్కారం కోసం డిహెచ్‌పిఎస్ నిరంతర ఉద్యమాలు ఆందోళనలు నిర్వహిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతుందన్నారు. దళితులహక్కుల సాధన పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆగస్టు 3న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టిడిని జయప్రథం చేయాలని సలిగంటి కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యువకులు, పురుషులు, మహిళలు, కవులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి కే రత్మకుమారి, జిల్లా అధ్యక్షులు దొంతమాల చెన్నయ్య, నాయకులు మామిడాల ధనలక్ష్మీ, ఉరుసు రామకృష్ణ, పాలమూరి శ్రీనివాస్, ఎర్రవెల్లి శంకర్, మండలరాజు ఇమ్మానుయేల్ దార్ల లక్ష్మీ చెరుకు సారయ్య నక్క నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : ఐటిడిఏ పిఓ



**ప్రజాపక్షం/భద్రాచలం :** రానున్న 36 గం.లలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ఐటిడిఏ పరిధిలోని ఆశ్రమపాఠశాలలు, గురుకులాల్లో చదువు తన్న విద్యార్థుల ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరద ముంపుకు గురయ్యే ప్రాంతాల్లోని గిరిజనులను, విద్యార్థులను ముందస్తుగానే అప్రమత్తం చేయాలన్నారు. ఈ సమయంలో నదులు, వాగులు, చెరువుల వెంట వెళ్లరాదని వాటిని దాటే ప్రయత్నం చేయరాదన్నారు. తాగే నీటిని కాచి వడపోసి తాగాలని, తాగునీరు కలుషితమయ్యే అవకాసం ఉన్నందున గిరిజనులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షా కాలంలో విద్యుత్ సరఫరా విషయాల్లో జాగ్రత్తలు అవసరమని, గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉన్నందున వాటిని గుర్తించిన ప్రజలు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఉండే గర్భిణీలను గుర్తించి ముందస్తుగానే ఆస్పత్రులకు తరలించాలన్నారు. వానా కాలంలో గిరిజనులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు.

## చినుకుతో చిగురిస్తున్న ఖరీఫ్ ఆశలు..!

- ఊపిరి పోసుకుంటున్న పుడమితల్లి
- పొలం బాట పడుతున్న రైతన్నలు
- మరో నాలుగు రోజుల పాటు వర్ష సూచన





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలే పడవని ఆందోళన చెందుతున్న వేళ జిల్లాలో గడిచిన రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎండిన నేలలు తడిబారుతున్నాయి. దీంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు వేగంపుంజు కోనున్నాయి. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయాధికారుల ఈ ఖరీఫ్ సీజన్లో 6,37,800 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారనే అంచనాలు వేశారు. ప్రధానంగా జిల్లాలో వరి 1.75 లక్షల ఎకరాలు, పత్తి 2.10 లక్షల ఎరాలు, మొక్కజొన్న 87వేల ఎకరాలతో పాటు అపరాలు, కూరగాయలు, మిర్చి, పామాయిల్ వంటి ఇతర పంటలను సాగుచేస్తుంటారు. జిల్లాలో అత్యధిక భాగం రైతులు ఖరీఫ్ సీజన్లోనే సాగుచేస్తుంటారు. ఇక్కడ నదులు, ఉపనదులు వాగులు, కాల్వలతో పాటు ఆకాశాయిపై అధికంగా ఆధారపడి సాగు సాగనుంది. ఇప్పటికే వరినార్లు పోసిన రైతులు ఆ నారుమళ్లను బ్రతికించుకునేందుకు ప్రత్యేకంగా నీటిని తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా పత్తికి జీవం పోసేందుకు మొక్కమొక్కను తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా వర్షాలు పడుతుండటం అత్యంత అనుకూలంగా కనిపిస్తోంది. మంగళ,బుధవారాల్లో జిల్లాలోని అశ్వాపురం మండలంలో 61.04 మి.మీ, కరకగూడెంలో 46.01 మి.మీ చర్లలో 59.03 మి.మీ వర్షపాతం నమోదైంది.

### రైతన్నల పొలం బాట :

వానలు మెండుగా పడుతుండటంతో రైన్నలు పొలం బాట పట్టారు. ఇప్పటికే వేసవి దుక్కులు దున్నిన రైతులు ఇంత కాలం వర్షపు చుక్కల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు దుక్కులకు సరిపోయే వాన కురుస్తుండటంతో గట్టుకొట్టి నీరు నిల్వ ఉండేలా చేస్తున్నారు. నేక సారాన్ని పెంచేందుకు సేంద్రీయ ఎరువులను కలుపుతున్నారు. దీంతో సూక్ష్మ జీవుల చెలనం పెరిగి మొక్కలకు అవసరమైన పోషకాలు సులభంగా అందుతాయి. ఇప్పటికే పలు రాకల విత్తనాలను ఎంపిక చేసుకుని సిద్ధం చేసుకున్న రైతులు పంటలు వేసేందుకు సిద్ధ పడుతున్నారు. పలు చోట్ల కొద్దిపాటి సాగు మొదలవగా ఆ పంటలకు ప్రస్తుత వర్షం జీవం పోస్తోంది. రైతు కుటుంబాలతో పాటు వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

### మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు :

అల్పపీడనం కారణంగా మరో నాలుగు రోజుల పాటు ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు జిల్లాలో కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ వర్షాలు ఇలానే కొనసాగితే ఖరీఫ్ సాగు పూర్తిస్థాయిలో విస్తరించి జలాశయాలు కుంటలు నదులు నీటి కళను సంతరించుకోనున్నాయి. భూ గర్భ జలాలు పెరిగి రభీ పంటలకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడనుంది. అంతే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు.

### అయినా లోటు వర్షపాతమే :

జిల్లాలో ఇప్పటికీ లోటు వర్షాపాతమే నమోదవుతోంది. గడిచిన ఈ రెండ్రోజుల్లో వర్షాలు పడుతున్నాయే తప్ప అంతకు ముందు చినుకు ముఖం చాటేదయంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. జూన్ నెలలో సగటున 168.98 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఆ నెల్లో కేవలం 151.01 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇంకా 10.05 మిల్లీ మీటర్ల లోటు వర్షపాతంలో ఉన్నాం. జూలై నెల్లో ఇప్పటి వరకు 301.07 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 182.05 మి.మీటర్ల వర్షం మాత్రమే పడిందియ. ఇంకా 39.05 మిల్లీ మీటర్ల లోటు వర్షపాతంలో ఉన్నాం.

## వాట్సాప్ స్టేటస్‌ల్లోనే జీవితం..!

-ఏం తెలిజేయాలన్న సోషల్ మీడియాలోనే..
-లైకులు, కామెంట్లు కోసం పరితపిస్తున్న నేటి తరం
-తగ్గిపోయిన ప్రత్యక్ష పలకరింపులు
-పెరిగిన సాంకేతికతతో మారిన జీవనశైలి





**ప్రజాపక్షం/వైరా:** ఒకప్పుడు జీవితంలో ఆనందం వచ్చినా, విషాదం ఎదురైనా మొదట గుర్తొచ్చేది మనుషులే. సంతోషాన్ని కుటుంబ సభ్యులతో, స్నేహితులతో పంచుకునేవారు. బాధను ఆత్మీయుల ఎదుట వ్యక్తం చేసి మనసు తేలిక చేసుకునేవారు. శుభవార్త చెప్పాలంటే బంధువులకు ఫోన్ చేశారు. కుటుంబ వేడుకల్లో తీసుకున్న ఫొటోలను ఆల్బమ్‌లో భద్రపరచి సంవత్సరాలు తర్వాత వాటిని చూస్తూ మధు జ్ఞాపకాలను మళ్లీ ఆస్వాదించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఏతిలో స్మార్ట్‌ఫోన్, అందులో సోషల్ మీడియా, జీవితంలో ఏం జరిగినా ముదుగ కనిపించేది స్టేటస్‌లోనే ఉదయం నిద్రలేచిన క్షణం నుంచి రాత్రి నిద్రపోయే వరకు ప్రతి అనుభూతి, ప్రతి సంఘటన, ప్రతి ప్రయాణం, ప్రతి విజయం, ప్రతి వేడుక 24 గంటల డిజిటల్ స్టోరీగా మారుతుంది. టీ కప్పు నుంచి ఐదు నక్షత్రాల హోటల్ భోజనం వరకు...పుట్టినరోజు నుంచి పెళ్లి వేడుక వరకు ఉద్యోగంలో పదోన్నతి నుంచి విదేశీ పర్యటన వరకు..ప్రతి సందర్భానికి స్టేటస్ ఒక తప్పనిసరి ఆచారంగా మారిపోయింది. ఒకప్పుడు ఈ క్షణాన్ని ఎలా ఆస్వాదించాలి? అని ఆలోచించిన మనిషి ఇప్పుడు దీనిని ఎలా పోస్ట్ చేయాలి? అని ముందుగా ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. సోషల్ మీడియా మనుషులను దగ్గర చేసింది అనేది నిజమే. దూరంలో ఉన్న బంధువులు, స్నేహితులు కూడా మన జీవిత విశేషాలను క్షణాల్లో తెలుసుకునే అవకాశం కల్పించింది. కాని అదే సమయంలో ప్రత్యక్ష సంభాషణలను తగ్గించింది. ఎలా ఉన్నావు? అని అడిగే ఫోన్ కాల్స్ తగ్గిపోయాయి. స్టేటస్ చూశాను అనే ఒక్క మాటతో పలకరింపులు ముసిగిపోతున్నాయి. ఎమోజీలు భావోద్వేగాల స్థానాన్ని ఆక్రమించాయి. లైక్‌లు, షేర్లు, కామెంట్లే ఆప్యాయతకు కొలమానాలుగా మారుతున్నాయి. మరో ఆందోళన అంశం వ్యక్తిగత గోప్యత. కుటుంబానికి మాత్రమే పరిమితం కావాల్సిన ఎన్నో విషయాలు ఇప్పుడు ప్రపంచం ముందుకు వస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిఒక్కరూ తమ జీవితాన్ని నిరంతరం ప్రదర్శించే సంస్కృతి పెరుగుతుంది. దీంతో వ్యక్తిగత జీవితం, సామాజిక జీవితం మధ్య ఉన్న సరిహద్దు క్రమంగా చెరిగిపోతుంది. సాంకేతికతను నిందించడం పరిష్కారం కాదు. కాని దానిని ఉపయోగించే విధానంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రతి క్షణాన్ని పోస్ట్ చేయాల్సిన అవసరం లేదు. కొన్ని ఆనందాలు కుటుంబంతోనే పంచుకుంటే మరింత మధురంగా ఉంటాయి. కొన్ని జ్ఞాపకాలు కెమెరాలో కాకుండా మనసులో నిలిస్తే వాటి విలువ మరింత పెరుగుతుంది. స్టేటస్‌లు 24 గంటల్లో అదృశ్యమవుతాయి. కాని మనషులతో గడిపిన క్షణాలు, ఆప్యాయతతో పంచుకున్న మాటలు, హృదయంలో పదిలమైన జ్ఞాపకాలు జీవితాంతం నిలిచిపోతాయి. అందుకే జీవితాన్ని ప్రదర్శించడం కంటే జీవించడం గొప్పది. సోషల్ మీడియాను ఉపయోగిద్దాం. కాని అది మన జీవితాన్ని శాసించే స్థాయికి చేరకుండా చూసుకోవడం మనందరి బాధ్యత.

## యూత్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ అశ్వాపురం మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. 2లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నెలకు రూ 4వేల నిరుద్యోగ భృతి, స్కూటీలు, యూత్ కమిషన్, రూ 10లక్షల వడ్డీలేని విద్యా రుణాలు, పదో తరగతి ఉత్తీర్ణులకు ప్రోత్సాహకం, ప్రైవేట్ రంగంలో 75శాతం ఉద్యోగా లు సహా ప్రకటించిన 24హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో యువత కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

## అశ్వాపురంలో విస్తృత తనిఖీలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆదేశాలు, అశ్వాపురం సీఐ ఎల్లయ్య సూచనల మేరకు బుధవారం అశ్వాపురం మండలంలో పోలీసులు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి సేవించడం, విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడంపై వచ్చిన సమాచారంతో అనుమానిత ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాలు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో మత్తు పదార్థాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని ఎస్ఐ రాజేష్ తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడమే లక్ష్యమని పేర్కొన్న ఆయన, గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** గురుపూర్ణిమ సందర్భంగా దుమ్ముగూడెంలోని పవిత్ర గోదావరి తీరం వద్ద వెలసిన శ్రీ దత్త శేష సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామున మేలకొలుపు హారతితో ప్రారంభమైన వేడుకల్లో గణపతి పూజ, పంచామృతాలు, పాలు, పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలు, పుష్పాలతో స్వామివారిని అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ విటివి రమణారావు, సెక్రటరీ శేఖర్ కెల్లా, అప్పాజీ మీసాల, వేణుగోపాల్ కెల్లా, ప్రకాశ్ కెల్లా, బైరెడ్డి అరవింద్, అశోక్ కెల్లా, మహి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గురుపౌర్ణిమ వేడుకలు



**ప్రజాపక్షం/కామేపల్లి:** పండితాపురం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణిమ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాబాకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. డిఎన్‌సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దిరిశాల నరేష్ చౌదరి, డైరెక్టర్ స్వాతి దంపతుల ఆధ్వర్యంలో సుమారు 1,300 మంది భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. అలాగే సుమారు రూ 30వేల విలువైన పంచలోహ దీపారాధన కుండలు తోపాటు ఇతర పూజా సామగ్రిని ఆలయానికి విరాళంగా అందజేశారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు వంగివరపు సీతారామాంజనేయ శర్మ పూర్ణకుంభంతో డైరెక్టర్ స్వాతికి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా స్వాతి మాట్లాడుతూ ఆలయ పూర్వ వైభవ పునరుద్ధరణకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిన్లాండ్ విద్యా వ్యవస్థపై నేడు సీఎం సమీక్ష



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఫిన్లాండ్ విద్యా వ్యవస్థ పై రాష్ట్ర బృందం జరిపిన అధ్యాయన బృందం తో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. ఈ మేరకు సమీక్షకు ఫిన్లాండ్ బృందం ప్రతినిధి, నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు హాజరుకానున్నారు. ఏప్రిల్ 18 నుంచి 26 వరకు ఫిన్లాండ్ లో పర్యటించారు. బృందం ప్రతినిధి గా ఉన్న నేలకొండపల్లి యంఈవో చలపతిరావు ను సమీక్షకు హాజరు కావాలని సీయంవో ను ఉత్తర్వులు అందాయి. అక్కడి విద్యా విధానం ను సీఎం కు సమీక్షలో వివరించనున్నారు. సీఎం సమీక్షలో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా బుధవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో నేలకొండపల్లి మండల ఖ్యాతిని పెంచాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్ కుమార్, స్వామి, మాధవ్, శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు టి.వెంగళరావు, బీ.శ్రీనివాస్, తొర్తి సురేష్, కోటేశ్వరరావు, చీనా తదితరులు పాల్గొన్నారు.

# లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం

**-పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్నెస్పి అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్ అధికారుల తరుపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నెస్పి అతిథి గృహ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారాస్ కుమార్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఖమ్మంజిల్లా సమగ్రాభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు. జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసి అనంతరం హైదరాబాద్ వెళ్లారు.

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణంలోని శ్రీదివ్య షిర్డీ సాయి బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. మధిరతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి సాయిబాబా దర్శనం చేసుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం కాగడ హారతితో ప్రారంభమైన కార్యక్రమాల్లో మంగళస్నానం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, మేళతాళాల నడుమ స్వామి వారికి సర్వాంగ సుందర అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రంగా హనుమంతరావు, దేవిశెట్టి రంగారావు, కురువెళ్ల వెంకట పురుషోత్తంరావు, భక్తులు పాల్గొన్నారు

# దెందుకూరులో హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/మధిర:** దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సబ్ సెంటర్ దెందుకూరులో డాక్టర్ సాయి పృథ్విరాజ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. అలాగే ఫీవర్ కేసులు గుర్తించి బిపిఎస్ తీయడం జరిగింది. టోటల్ ఓపిలు 55 చూడటం జరిగింది. హౌస్ టు హౌస్ ఫీవర్ సర్వే, డ్రైడే నిర్వహించడం జరిగింది. అలాగే వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, అంటువ్యాధుల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, సిహెచ్‌వో వెంకటేశ్వర్లు, గ్రామ సెక్రటరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మాస్‌లైన్ జిల్లా కార్యదర్శిగా సివై పుల్లయ్య






**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శిగా సివై పుల్లయ్య ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు జిల్లా కార్యదర్శిగా కొనసాగిన గోకినేపల్లి వెంకటేశ్వరరావు రాష్ట్ర కమిటీ బాధ్యతల్లోకి వెళ్లడంతో ఆయన జిల్లా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. విద్యార్థి, యువజనోద్యమాలలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ బాధ్యతలు నిర్వహించిన సివై పుల్లయ్యను పార్టీ బాధ్యుల సమక్షంలో కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. పుల్లయ్య నేలకొండపల్లి మండలం కొరట్లగూడెంలో జన్మించారు. డిగ్రీ వరకు చదివిన పుల్లయ్య పిడిఎస్‌యులో సుదీర్ఘ కాలం పనిచేశారు. యువజన విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించిన ఆయన మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా పని చేస్తున్నారు. పార్టీ నిర్వహించిన పలు ఆందోళనల్లో పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపారు.

**హామీలను నెరవేర్చాలి : పోటు రంగారావు**

తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ పింఛన్ల పెంపు, ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీని అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జంతర్ మంతర్‌లో పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని, హింసాకాండపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. మీడియా సమావేశంలో గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రామయ్య, అశోక్, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, బందెల వెంకయ్య పాల్గొన్నారు.

# నాగబత్తిని భాస్కర్‌రావుకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగబత్తిని భాస్కర్‌రావు గురుపౌర్ణమి సందర్భంగా ఘన సన్మానం అందుకున్నారు. ఖమ్మంలోని కాన్‌రాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా చేతుల మీదుగా ఆయనకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందించిన నాగబత్తిని భాస్కర్‌రావు అనేకసార్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు. వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి, పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు గురుకుల విద్యాసంస్థల్లో సీట్లు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యా సేవలతో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తూ పేద విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేయడం, బాల కార్మిక నిర్మూలన కోసం కృషి చేయడం, ఒక నెల జీవితాన్ని విద్యార్థుల సంక్షేమానికి విరాళంగా ఇవ్వడం, తన జీతంలో కొంత భాగాన్ని నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఖర్చు చేయడం వంటి సేవలు ఆయనను ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలబెట్టాయి. ఇలాంటి సేవలను గుర్తించి గురుపౌర్ణమి రోజున ఆయనకు లభించిన ఈ సన్మానం ఉపాధ్యాయ వృత్తికే గౌరవాన్ని తీసుకొచ్చిందని పలువురు విద్యావేత్తలు, శిష్యులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలు సాగు చేయాలని సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో నిర్వహించిన సభలో సర్పంచ్ రమాదేవి, ఏఈవోలు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం లోటు నెలకొందన్నారు. రైతులు అధిక నీటితో సాగయ్యే పంటలు కాకుండా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అపరాలు, చిరు ధాన్యాలు, పామాయిల్, కూరగాయల సాగు చేపట్టాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం సూచించిన విధంగా సన్న రకం వరి విత్తనాలను మాత్రమే సాగు చేయాలన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విబి జీ రాం జీ పథకం క్రింద ఇంకుడు గుంటను నిర్మిస్తే నిధులు వస్తాయని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఇంకుడు గుంటలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్వని, పంచాయతీ కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు, రాజా, సందీప్, కోటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు. కొర్లబోడుతండాలో జరిగిన సభలో సర్పంచ్ చిన్నయ్య నాయక్ మాట్లాడుతూ రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేయాలన్నారు. ప్రతి ఒక్కరు ఇంకుడు గుంటల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

# సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ఇల్లందు:** గురుపౌర్ణమి సందర్భంగా బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు దిండిగాల రాజేందర్ లలిత్ కళామందిర్ రోడ్డులోని శ్రీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నవరపు మల్లికార్జున్ రాజేందర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం రాజేందర్ ఆలయానికి విచ్చేసిన భక్తులకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి, సాయిబాబా ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆనందరావు



**ప్రజాపక్షం/ఇల్లందు:** కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఇల్లందు పట్టణం 22వ వార్డుకు చెందిన ఆలేటి ఆనందరావు(చిన్ని)నియమితులయ్యారు. ఈ నియామకాన్ని జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ గద్దల రమేష్ ప్రకటించారు. ఈసందర్భంగా ఆలేటి ఆనందరావు మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ గద్దల రమేష్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తూ ఎస్సీ వర్గాల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ నియామకంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆలేటి ఆనందరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ రోడ్డుపై నడిచేదెలా..?

**బురదయమంగా పాత కూరగాయల మార్కెట్ రోడ్డు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న పాత కూరగాయల మార్కెట్ రోడ్డు అధ్వానంగా మారి ప్రజలకు నిత్య నరకయాతనగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదయమంగా మారడంతో కాలినడకనే వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఎవరు జారిపడతారోనన్న భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఈ రోడ్డుపై నడవడానికి భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా బురదలో నడుస్తూ యూనిఫాంపై మట్టి చిందుకోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక వ్యాపారులు, ప్రజలు కూడా ప్రతిరోజు ఇదే సమస్యలను ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఈ రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ఈ రహదారి వెంటనే అభివృద్ధి చేసి, బురద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వైరా మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డును చూస్తేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది.

# బాల కార్మికులతో పని చేయిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/దమ్ముగూడెం:** బాల కార్మికుల నిర్మూలనకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. మండలంలోని లక్ష్మీ నగరం గ్రామంలో కొన్ని దుకాణాల్లో బాల కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారనే సమాచారంతో బుధవారం దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లు గుర్తించిన దుకాణ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎక్కడైనా బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీఐ వెంకటప్పయ్య ప్రజలను కోరారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

# అడవుల సంరక్షణలో పులులు కీలకపాత్ర




**- కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని**

**ప్రజాపక్షం/పాల్వంచ:** అడవుల సంరక్షణలో పులులు కీలక పాత్ర వహిస్తాయని, వాటిని సంరక్షించటానికి సమాజంలో ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి కిన్నెరసాని డీర్ పార్క్‌లో తెలంగాణ ప్రభుత్వ అటవీశాఖ, వన్య ప్రాణి నిర్వాహణ కిన్నెరసాని డివిజన్, యానంబైల్ రేంజ్ ఆధ్వర్యంలో బుదవారం అంతర్జాతీయ పులుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, అడవుల జీవవైవిద్యాన్ని నిలబెట్టడంలో పులులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని చెప్పారు. పులుల సంరక్షణ అంటే కేవలం ఒక జంతువును కాపాడటం మాత్రమే కాదని, అడవులను, నీటి వనరులను మరియు భావి తరాల భవిష్యత్తును కాపాడటమేనన్నారు. కిన్నెరసాని అభయారణ్యం వన్యప్రాణులకు ఎంతో అనువైన ప్రాంతమని, వన్య ప్రాణుల రక్షణకు, అడవుల విస్తరణకు ప్రభుత్వం, అటవీశాఖ నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు సైతం అటవీశాఖతో కలిసి వన్యప్రాణుల సంరక్షణలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ సంరక్షణ అధికారి (సిసిఎఫ్) భీమానాయక్, జిల్లా అటవీశాఖ అధికారి(డిఎఫ్ఓ) సిద్దార్థ విక్రమ్‌సింగ్ ఐఎఫ్ఎస్, ఎఫ్‌డిఓ బి. బాబు డిసిఎఫ్, కిన్నెరసాని సర్పంచ్ వజ్జా రామక్రిష్ణ, ఏసిఎఫ్ క్రిష్ణప్రసాద్, కిన్నెరసాని గురుకుల కళాశాల (సిఓఈ) వైస్ ప్రిన్సిపాల్ జి. వెంకటేశ్వర్లు, యానంబైల్ ఎఫ్ఆర్ఓ కవితా మాధురి, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, కళాశాల, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రానున్న 36 గం.లలో భారీ వర్షాలు ఉన్న హెచ్చరిక నేపథ్యంలో జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం అన్నిశాఖల అధికారులతో టెలీకాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వరద ముంపుకు గురయ్యే ప్రాంతాలు ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలు చెరువులు, గోదావరి పరివాహక ప్రాంతాలకు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు చేయాలన్నారు. వర్షా కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, సురక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలుతీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు సూచనలు సలహాలు చేయాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం వాటిల్లకుండా చూడాలని ఆస్పత్రుల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.మారుమూల గ్రామాల గర్భిణీలను ముందుగానే గుర్తించి వారిను సురక్షిత ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలించాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# వైభవంగా పోకల దమ్మక్క స్మృతియాత్ర

**- రామాలయంలో ప్రత్యేక పూజలు**
**- దమ్మక్క విగ్రహానికి అభిషేకం**
**- ప్రారంభించిన ఎంఎల్‌ఏ డా.తెల్లం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** అపర భక్తురాలు పోకల దమ్మక్క స్మృతి యాత్ర బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. భక్తరామదాసు రామాలయాన్ని నిర్మించక ముందు భద్రగిరిపై నిలువ నీడ లేకుండా ఉన్న రామున్ని గుర్తించి పందిరి ఏర్పాటు చేసి తాటిపండ్లను నైవేద్యంగా దమ్మక్క సమర్పించి పూజలు చేశారు. భద్రాచలం ప్రాంతంలో రాముల వారు నిత్య పూజలు అందుకోవడానికి ఆధ్యురాలైన దమ్మక్కను ప్రతీ ఏటా గురుపూర్ణిమ నాడు స్మరించుకుంటూ ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో రామాలయంలో ప్రత్యేక పూలు పండ్లతో స్వామికి నైవేద్యం సమర్పించి శాస్త్రోక్త పూజలు జరిపించారు. అనంతరం వర్షంలోనే గిరి ప్రదర్శన నిర్వహించి పట్టణంలో ఉన్న పోకల దమ్మక్క విగ్రహానికి అభిషేకం చేసి పుసుపు, కుంకుమ సమర్పించి నూతన వస్త్రాలు ధరింపజేసి పూల మాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు ప్రారంభించగా సర్పంచ్ పూనెం కృష్ణ, గిరిజన కొండరెడ్ల నాయకుడు ముర్ల రమేష్‌తో పాటు ఆలయ ఇఓ దామోదరావు, అర్చకులు సిబ్బంది పలువురు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ పోకల దమ్మక్క రామునికి చేసిన సేవ మరువలేనిదని ఇంతటి వైభవం ఈ భద్రాచలానికి వచ్చిందంటే తొలినాళ్లలో ఆమె రాముల వారిని గుర్తించినందుకే అని తెలిపారు. అలాంటి భక్తులను ప్రతీ ఏటా స్మరించుకుంటూ భగవంతుని పట్ల వారికి ఎంతటి భక్తి ఉందో తెలిపేందుకు ఇతరులకు మార్గం చూపేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులపై ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పల వెంకట రమణ విమర్శించారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, యువత, మహిళలు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పేద, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. 2025,26 విద్యా సంవత్సరానికి కేంద్రం విడుదల చేసిన రూ 276కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం తన వాటి రూ 69 కోట్లు విడుదల చేయకపోవడంతో వెనక్కి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు పలుమార్లు సూచించినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టులో 70నుంచి 75శాతం పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ప్రాజెక్టు పురోగతి నిలిచిపోయిందని అన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధిలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు విఫలమయ్యాయని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. ఈసమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు దొడ్డ రమేష్, మాజీ ఎంపీపీ మొరంపూడి అప్పారావు, బీఆర్ఎస్ నాయకులు మట్ల నాగమణి, కొమరయ్య, శనగపాటి సీతారాములు, కొండవీటి చంద్రశేఖర్, పుష్పాల చంద్రరావు, బి ధర్మ, తాటి రవి, గంగవరపు సుధాకర్, దేవభక్తుని చిట్టిబాబు, ఓరబద్ది ఎంకన్న, సిద్దుల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి



**ప్రజాపక్షం/కరకగూడెం:** మణుగూరు డిఎస్పి వి రవీందర్ రెడ్డి వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ తనిఖీలలో స్టేషన్ లోని పలు రికార్డులను, సీసీటీవీ ల పనితీరును, పోలీస్ స్టేషన్ సిబ్బంది యొక్క అవసరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. పోలీస్ సిబ్బంది ని నీతి నిజాయితీ తో పనిచేసి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ యొక్క పరిసర ప్రాంతాల్ని ఎప్పుడూ కూడా శుభ్రంగా ఉంచుకోమని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఏడుళ్ళ బయ్యారం వి వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్సై పివిఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని నాయకులగూడెం గ్రామం లో గల పవనసుత హరిహరాదుల దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు చొప్పకట్ల జనార్ధన శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాత : కాల మునందు అర్చకులు ప్రవరక్ష శర్మ రామచంద్ర శర్మ వేణుగోపాలచార్యులు మంగళ తోరణములు, గణపతి పూజ, దీక్ష దారులకు కంకణము పూజ, స్వామివారి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయ భక్త బృందంచే ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి సాయిబాబాను అయ్యప్ప స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమం జరిగింది.

# కొంగరలో సమగ్ర భూ సర్వే ప్రారంభం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేను నేలకొండ పల్లి మండలం లోని కొంగర గ్రామంలో బుధవారం ప్రారంభించారు. భూ పంచాయతీలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే పథకం లో భాగంగా మండలం లోని కొంగర ను ఎంపిక చేశారు. గ్రామంలో ఉన్న భూములు ఎంత, అందులో ప్రభుత్వం భూమి ఎంత, రైతులకు చెందిన భూములు ఎంత, గ్రామ విస్తీరణం ఎంత, పట్టా భూములు, అసైన్మెంట్ భూములతో పాటు అన్ని రకాల భూములను గుర్తించనున్నారు. ఇప్పటికే గ్రామం మెత్తం కు సరి హద్దులను గుర్తించి రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సర్వే వలన రైతుల మధ్య భూ పంచాయతీ లు ఈ సర్వేతో సమిసిపోనున్నాయి. ఈ సందర్భంగా నేలకొండపల్లి తహాశీల్దార్ పి.రాంప్రసాద్ పాల్గొని..సర్వేయర్, రెవిన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయన మాట్లాడుతూ, కొంగర గ్రామంలో సమగ్ర భూ సర్వే కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్ రావు, జీపీవోఆశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైదులు మృతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడిబోయిన సైదులు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడు కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన మృతదేహం ను పార్టీ మండలాధ్యక్షుడు కొడాలి గోవిందరావు, జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, పసుపులేటి ఉపేందర్, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్ తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి ని తెలియజేశారు. అశ్రునయనాల మధ్య రైతు అంత్యక్రియలు, మండలం లోని మంగాపురంతండా లో విద్యుదాఘాతం తో మృతి చెందిన రైతు రామదాసు అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. సర్పంచ్లు ఆశోకరాణి, బోయిన వేణు, నాయకులు బచ్చలకూరి నాగరాజు, అంజని, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, భూక్యా చిన్న నాయక్, సీత్యా, కడియాల నరేష్, గట్టిగుండ్ల విజయ్, వంశీ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి పోరాటం



**ప్రజాపక్షం/కూసుమంచి:** తెలంగాణలో గ్రామ పంచాయితీ వార్డు సభ్యుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం(టీడబ్ల్యూఎంఎఫ్)పార్టీలకు అతీతంగా పని చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి గుండా ఉపేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయితీ అభివృద్ధి పనుల్లో వార్డు సభ్యులను భాగస్వామ్యం చేయడంతో పాటు, అభివృద్ధి శిలాఫలకాలపై వారి పేర్లు పొందుపరచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి వార్డు సభ్యుడికి రూ 3వేల గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. తనపై విశ్వాసం ఉంచి ఖమ్మం జిల్లా బాధ్యతలు అప్పగించిన టీడబ్ల్యూఎంఎఫ్ వ్యవస్థాపకురాలు నాగబెల్లి జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో అన్ని మండలాల్లో కమిటీలు పూర్తి చేసి, గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులు పాత్రను బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# పీఎంఈజీపీలో భారీ అక్రమాలా..?

**-క్షేత్రస్థాయి పరిశీలనలు గాలికి..**
**-ఫారం అకౌంట్లు, బిల్లులపైనా అనుమానాలు**
**-అధికారుల కనుసన్నల్లోనే తంతు సాగిందనే ఆరోపణలు**
**-పక్కదారి పడుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం**
**-యూనిట్లను పరిశీలించిన అధికార బృందం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కేంద్ర ప్రభుత్వం ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కెవిఐసి) ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఓంఈజిపి) నిరుద్యోగ యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మాజీ సైనికులు, దివ్యాంగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అమలవుతోంది. అయితే సత్తుపల్లి ప్రాంతంలో ఈ పథకం అమలులో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం, మధ్యవర్తుల జోక్యం, నిబంధనల ఉల్లంఘనల కారణంగా ప్రభుత్వ ఆశయమే ప్రశ్నార్థకంగా మారిందని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పీఎంఈజీపీ మార్గదర్శకాల ప్రకారం రుణం మంజూరు చేసే ముందు దరఖాస్తుదారుడు ప్రతిపాదించిన యూనిట్‌ను బ్యాంకు అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలి. యూనిట్ ఏర్పాటు చేసే స్థలం, మౌలిక వసతులు, యంత్రాలు, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను నిర్ధారించిన తర్వాతే రుణం మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ సత్తుపల్లి పరిధిలో ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని సిద్ధారం గ్రామంలో గత 15 సంవత్సరాలుగా కొనసాగుతున్న కోళ్ల ఫారాన్ని కొత్తగా నిర్మించిన యూనిట్‌గా చూపించి రుణం, సబ్సిడీ పొందినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇప్పటికే ఉన్న యూనిట్‌ను కొత్త ప్రాజెక్టుగా చూపించి బ్యాంకును తప్పుదారి పట్టించారని, ఈ వ్యవహారంలో సంబంధిత అధికారుల సహకారం కూడా ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఫారం అకౌంట్లు, బిల్లులపైనా అనుమానాలుసత్తుపల్లి డీసీసీబీ బ్యాంకు ద్వారా మంజూరైన సుమారు 70 పీఎంఈజీపీ రుణాల్లో కొన్నింటికి సంబంధించిన ఫారం అకౌంట్లు, బిల్లులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోటేషన్లు, బిల్లులు సమర్పించి నప్పటికీ సంబంధిత సరఫరాదారుల ఖాతాల్లో నిధులు జమ కాలేదని, తప్పుడు బిల్లులు చూపించి లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా డబ్బులు జమ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో బ్యాంకులోని కొందరు అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

### విందు అందితేనే రుణాలా..?

ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఓ అధికారి, ఓ లబ్ధిదారుడి ఇంట్లో జరిగిన విందులో పాల్గొన్న తర్వాత అదే గ్రామంలో వరుసగా రుణాలు మంజూరు చేశారనే ప్రచారం కూడా స్థానికంగా సాగుతోంది. అధికారులకు దగ్గరైన వారికే ప్రాధాన్యత లభిస్తోందని, నిజమైన అర్హులు మాత్రం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పేద, మధ్య తరగతి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ ప్రతిష్మాత్మక పథకం కొందరి అక్రమాలకు వేదికగా మారిందనే ఆరోపణల నేపథ్యంలో, ప్రభుత్వం స్వతంత్ర కమిటీని నియమించి పీఎంఈజీపీ రుణాల మంజూరు ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జరిగిన అవకతవకలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు నిజమైన అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# మార్కెట్‌లోకి టాటా సియారా ఈవి విడుదల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రఖ్యాతిగాంచిన టాటా మోటార్స్ తమ సక్సెస్ మోడలైన టాటా సియారా నుండి కొత్తగా టాటా సియారా ఎలక్ట్రిక్ కారు (ఈవి)ను ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. అధీకృత డీలరైన వెంకటరమణ మోటార్స్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో సియారా ఎలక్ట్రిక్ కారును ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసేటప్పుడు సీటుబెల్ట్ తప్పక ధరించాలన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు కట్టి ఖమ్మం అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను వాడటం వల్ల పొల్యూషన్ కూడా తగ్గుతుందని తెలిపారు. టాటా మోటార్స్ తమ వినియోగదారుల అభిరుచి మేరకు అధునాతన సౌకర్యాలతో సియారా కారును రూపొందించిందని తెలిపారు. వివిసి గ్రూప్ ఛైర్మన్ అండ్ ఎండి వంకాయలపాటి వెంకటరాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టాటా సియారా ప్యాసింజర్ వెరియంట్‌లో మార్కెట్‌లో సేల్స్ పరంగా ఒక ట్రెండ్ సృష్టించిందన్నారు. టాటా సియారా ఈవి కూడా కస్టమర్ల ఆదరణ పొందుతుందన్నారు. టాటా సియారా ఈవి 63కెడబ్ల్యూహెచ్, 75 కెడబ్ల్యూహెచ్ ల బ్యాటరీల సామార్థ్యంతో ఒకసారి ఛార్జ్ చేస్తే 667 కిలో మీటర్ల ప్రయాణించవచ్చునని తెలిపారు. ఒకసారి 120 కెడబ్ల్యూహెచ్ ఛార్జింగ్ చేస్తే 20 నిమిషాల్లో 80 శాతం ఛార్జింగ్ అవుతుందని తెలిపారు. ముఖ్యంగా బ్యాటరీపై మొదటి కస్టమర్‌కు 15 ఏళ్ల వారంటీ లభ్యమవుతుందని తెలిపారు. బూట్ స్పెస్, 622 కెపాసిటీతో, ట్రిపుల్ స్క్రీన్ డ్యాష్ బోర్డ్, 12.30 అంగుళాల వెడల్పు కలిగి సెంటర్, ప్యాసింజర్ డ్యాష్‌బోర్డ్ కలిగి ఉందన్నారు. డాల్బి అటోమెస్, 12జెబిఎల్ స్పీకర్లు, సేఫ్టీ పరంగా ఆరు ఎయిర్ బ్యాగులతో, 540 డిగ్రీ అండర్ ఫ్లోర్ కెమెరాతో, క్యూడబ్ల్యూడి టెక్నాలజీతో లభిస్తుందన్నారు. ఈ టాటా సియారా ఈవి ఎక్స్ షోరూం ధర రూ.18.79 లక్షల నుంచి ప్రారంభమై ఐదు వేరియంట్లలో లభ్యమవుతుందని తెలిపారు. వెంకటరమణ మోటార్స్‌లో కస్టమర్ల కొరకు క్విక్ సర్వీసు కూడా ఉందని వాటిని కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ విశాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యాం కూల్చివేత విధ్వంస పాలనకు నిదర్శనం

**-అభివృద్ధి విధ్వాంసానికి పాల్పడిన మంత్రులు**
**-మున్నేరు చెక్‌డ్యాం ప్రాంతాన్ని పరిశీలించిన బిఆర్‌ఎస్ నేతలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ వద్ద మున్నేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేయడం ప్రజా ప్రయోజనాలను విస్మరించి విధ్వంసకర పాలనకు నిదర్శనమని బిఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. బుధవారం ప్రకాష్ నగర్ వద్ద చెక్‌డ్యాం కూల్చివేసిన ప్రాంతాన్ని బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పరిశీలించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ చెక్‌డ్యాం కూల్చివేత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అనాలోచిత నిర్ణయమన్నారు. కేసిఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనలు ఆనవాళ్లను చెరిపివేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఖమ్మంజిల్లాలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అదే విధానాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఖమ్మం నియోజక వర్గంలో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను ధ్వంసం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందన్నారు. ఖమ్మం నగరానికి దీర్ఘకాలిక తాగునీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రకాష్ నగర్ వద్ద మున్నేరు వాగుపై సుమారు రూ.8 కోట్లతో చెక్ డ్యాం నిర్మించారని గుర్తు చేశారు. ఈ చెక్‌డ్యాం నిర్మాణంతో మున్నేరు పరివాహక ప్రాంతంలో భూగర్బ జలమట్టం గననీయంగా పెరిగి నగర వ్యాప్తంగా నీటి లభ్యత మెరుగుపడడంతో తాగునీటి తలెత్తలేదన్నారు. ఎటువంటి ఆలోచన, ప్రత్యామ్నాయ కార్యాచరణ లేకుండానే ఈ చెక్‌డ్యాంను కూల్చివేశారని ఆరోపించారు. దీని ఫలితంగా భవిష్యత్తులో నగరానికి తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. గత బిఆర్‌ఎస్ హయాంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో మున్నేరుకు ఇరువైపులా 17 కిలో మీటర్ల మేర రూ. 525 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. వెంటనే ప్రకాష్ నగర్ వద్ద చెక్‌డ్యాంను పునరుద్ధరించాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు గుండాల కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, బత్తుల మురళీప్రసాద్, పాలడుగు పాపారావు, మాటేటి నాగేశ్వరరావు, తోట రామారావు, తాజుద్దీన్, మెంతుల శ్రీశైలం, యర్రా అప్పారావు, మాటేటి కిరణ్, కొప్పెర నర్సింహారావు, ముక్కాల రాజేష్, రఘు, రవి పాల్గొన్నారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం :** నెల్లిపాక బంజరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పశంకర్ అధ్యక్షతన గురుపౌర్ణమి వేడుకలు ఘనం గా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెల్లిపాక గ్రామ సర్పంచ్ ముంద్రు వెంకట రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని, ఉపాధ్యాయులను గౌరవివించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం హెవీ వాటర్ ప్లాంట్ అశ్వాపురం రిటైర్డ్ ఉద్యోగి పెదిరెడ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, తరగతి గది నుంచే శాస్త్రవేత్తలు రూపుదిద్దుకుంటారని, ఉపాధ్యాయుల జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు అక్కిన శ్రీనివాసరామారావు, బిక్కసాని సత్యనారాయణ, గొర్రెముచ్చు వెంకటరమణ, భువన్, ఉపాధ్యాయులు దివ్యశ్రీ, రాంబాబు, శ్రీనివాసరావు, మున్నాలాల్, మంగయ్య, స్వాతి పాల్గొన్నారు.

# ట్రయాంఫ్ లగ్జరీ బైక్ షోరూం ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో ప్రఖ్యాతిగాంచిన మరో లగ్జరీ బైక్ ట్రయాంఫ్ షోరూం ప్రారంభమైంది. అధీకృత డీలరైన వెంకటరమణ ఆటో మొబైల్స్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రయాంఫ్ బైక్ షోరూంను ఖమ్మం నగర ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాసులు మాట్లాడుతూ లగ్జరీ బైక్ షోరూంలను హైదరాబాద్‌కు దీటుగా ఖమ్మం నగరానికి వెంకటరమణ ఆటో మొబైల్స్ వారు తీసుకు రావడం గర్వకారణమన్నారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ తోటి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని చిన్న హెల్మెట్ మనకు ఎంతో రక్షణగా నిలుస్తుందన్నారు. వివిసి గ్రూప్ సంస్థ ఛైర్మన్, ఎండి వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మం నగర యువత కొరకు ప్రత్యేకంగా ఇండియాలో అత్యంత ప్రజాధరణ పొందిన ట్రయాంఫ్ లగ్జరీ బైక్ షోరూంను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. ట్రయాంఫ్ బైక్‌లు క్లాసిక్ డిజైన్‌తో పవర్‌ఫుల్ ఇంజన్ కలిగి మంచి రైడింగ్ అనుభూతిని ఇస్తుందన్నారు. ట్రయాంఫ్ బైక్ 398.15సిసి, లిక్విడ్ కూల్డ్, 4 వాల్వ్, డివోహెచ్‌సి సింగిల్ సిలెండర్, టిఆర్ సిరీస్ ఇంజన్‌తో ఆరు స్పీడ్ గేర్లు, ఫ్యూయల్ ట్యాంక్ కెపాసిటి 13 లీటర్ల సామర్థ్యంతో ఫ్రంట్ సస్పెన్షన్స్, అప్‌సైడ్ డౌన్ ఫోర్క్స్‌తో వస్తుందన్నారు. లీటరుకు 35 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందన్నారు. దీని ఎక్స్ షోరూం ధర రూ. 2,08,971 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రారంభోత్సవ సందర్భంగా మొదటగా వచ్చిన కస్టమర్లకు ప్రత్యేక బహుమతి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ విశాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** చుంచుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో బుధవారం గురుపూర్ణిమ, వ్యాసపూర్ణిమ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ వేడుకల్లో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గురుపూర్ణిమ సందర్భంగా సాయిబాబాకు అష్టోత్తర 108 కళాశాలతోపాటు పండ్ల పంచామృతాలు, పండ్ల రసాలతో మహాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయిబాబాను సుందరంగా అలంకరించి ప్రత్యేక హారతులు సమర్పించారు. ఆలయ ప్రధాన పూజారులు మురళీకృష్ణమాచార్యులు, వంశీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం పాదుకల పూజ, గణపతి పూజ, మంగళవారం అభిషేకం, బిల్వపత్రార్చన, జ్యోతిర్లింగార్చన, సాయి ప్రవతార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, బుధవారం గురుపౌర్ణిమ సందర్భంగా ఉదయం నుంచే మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, నారాయణ సేవ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నదానంలో పాల్గొన్నారు. గురుపూర్ణిమ వేడుకల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పరుచూరి కృష్ణమోహన్ సుబ్బారావు, ఈదర నాగేశ్వరరావు, చిగురుపాటి శ్రీనివాస్, ముక్కామల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.